క్లుప్తంగా

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: ఆషాడమాసం అమావాస్య ఆదివారం కావడంతో జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంకమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. ఒంగోలులో వేద పురోహితుడు త్రినాథ్ చక్రవర్తి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వనమూలికా వితరణోత్సవం



సత్యసాయిబాబా మందిరంలో వనమూలికలు వితరణ చేస్తున్న పతంజలి యోగా సభ్యులు

ఒంగోలు మెట్రో: వనమూలికా వితరణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన్ ట్రస్ట్, మహిళా పతంజలి యోగా సమితి, యువభారత్, కిసాన్ పంచాయిత్ విభాగాల ఆధ్వర్యంలో జూలై 15 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు పతంజలి వృక్షారోపణ మాసంలో భాగంగా వనమూలికా దినోత్సవాలు నిర్వహిస్తున్నారు. మొక్కల పెంపకం, సంరక్షణపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆచార్య బాలకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక మంగమూరు రోడ్డులోని గాంధీనగర్, జెడ్పీకాలనీలోని శ్రీ సత్యసాయి సమగ్ర విద్యా కేంద్ర ప్రాంగణంలో వనమూలికా వితరణోత్సవం నిర్వహించారు. ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు గంధవల్ల బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. తద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యోగాచార్య పతంజలి యోగా సమితి ఉపాధ్యక్షుడు కేవీ శేషారావు, పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు బోయపాటి రవి, యువభారత్ జిల్లా అధ్యక్షుడు విజయ్ మోడీ, యోగా టీచర్లు దేశ వెంకయ్య, స్వర్ణలత, పూర్ణ, ప్రధాన కార్యదర్శి వలివేటి సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు పులికం కోటిరెడ్డి, గంగరాజు నాగేశ్వరరావు, సత్యసాయి మందిర కోఆర్డినేటర్ కోడెల శ్రీనివాసరావు, పతంజలి యోగా లీగల్ అడ్వైజర్ శ్రీమతి దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

15న గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ



సమావేశంలో పాల్గొన్న గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ వేడుకలను ఒంగోలు నగరంలో సెప్టెంబర్ 15వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినకరి ప్రభాకర్ తెలిపారు. సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీనాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని ఒంగోలు నగరంలోని బాలాజీ నర్సింగ్ హోంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సంఘం ఏర్పాటు చేసి 64 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు రాజ్యాంగబద్ధమైన మార్గంలో సమైక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్ వర్గీకరణపై విస్తృత స్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు. డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మానాయక్, పాలపర్తి వెంకటేశ్వర్లు, సాంబశివరావు, అంజనేయులు నాయక్, బాలూనాయక్, బాపూజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మరమ్మతులు, పరిశుభ్రతకు నోచుకోని కిటికీలు



ప్రధాన ద్వారం వద్దే తాండవిస్తున్న అపరిశుభ్రత





జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయాల వద్ద చెత్తాచెదారం

● కలెక్టర్‌గారూ..

కాస్త పట్టించుకోండి..!



పరిశుభ్రతకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయి ఆవరణ



భవన సముదాయి ఆవరణలో పూర్తిగా చెత్తతో నిండిపోయిన కాలువ

- అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం
- 24 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు నడుస్తున్నా.. పరిస్థితి దారుణం
- లోపల, బయట.. ఎక్కడ చూసినా చెత్తాచెదారం
- బూతు బంగళాలను తలపిస్తున్న కార్యాలయాల్లోకి వెళ్లాలంటేనే భయం..భయం
- నిత్యం అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరం


ఒంగోలు: ఒంగోలు నగరంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాల సముదాయం అంటే తెలియని వారు ఉండరు. గతంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలను ఇక్కడే నిర్వహించడంతో పాత రిమ్స్‌గా కూడా ఈ భవనాన్ని పిలుస్తుంటారు. రిమ్స్‌కు నూతన భవనాలు నిర్మించిన అనంతరం.. ఖాళీ అయిన పాత భవనంలోకి పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను తరలించారు. ప్రస్తుతం ఈ భవన సముదాయంలో మొత్తం 24 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు నడుస్తున్నాయి. అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బందితో పాటు ఆయా కార్యాలయాల్లో వివిధ పనుల కోసం నిత్యం ప్రజలు వచ్చివెళ్తుంటారు. కలెక్టరేట్ ఎదురుగానే ప్రభుత్వ భవనాల సముదాయం ఉన్నప్పటికీ.. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఇంత దారుణమైన పరిస్థితులు ఉండవంటే అతిశయోక్తి కాదు. అడుగడుగునా చెత్తాచెదారంతో ప్రభుత్వ భవనాల సముదాయం మొత్తం నిండిపోయింది. చుట్టుపక్కల ఆవరణతో పాటు లోపల ఎక్కడ చూసినా చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. పారిశుధ్యం గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో పాటు కనీసం బూజు కూడా దులపక భవనం మొత్తం పాడుబడిన బూతు బంగాళాను తలపిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టుపక్కల కలుపుమొక్కలు పెరిగిపోయాయి. చివరకు నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది చెత్త తరలించే బండ్లను కూడా ప్రభుత్వ భవనాల సముదాయం ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారేగానీ.. అక్కడ పారిశుధ్య పనులు మాత్రం చేయడం లేదు. అక్కడి చెత్తను తొలగించడం తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడి కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బందితో పాటు ఎవరికి వారే తమకెందుకులే అనుకుంటూ ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాల సముదాయాన్ని ఒకసారి పరిశీలిస్తే.. ఇప్పటి వరకూ అందరూ ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో ఇట్టే అర్థమవుతుంది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరం నడిబొడ్డున.. జిల్లా పరిపాలనా భవనమైన కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనమే ఇంత దారుణంగా ఉందంటే.. ఇప్పటి వరకూ పనిచేసిన కలెక్టర్ల నుంచి జిల్లా అధికారులు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్న ప్రతిఒక్కరికీ తలెత్తుతోంది. జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తమీమ్ అన్సారియా అయినా చొరవ తీసుకుని ప్రభుత్వ కార్యాలయాల భవనాల సముదాయాన్ని పూర్తిగా బాగుచేయించాలని ప్రజలు ఆశిస్తున్నారు.



ఓ గదిలో మూలన ఉన్న చెత్త కుప్ప



అపరిశుభ్రంగా ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం



అధ్వానంగా ఉన్న మొదటి అంతస్తు మెట్లమార్గం





నిరుపయోగంగా వాటర్ ట్యాంక్, తాగునీటి కుళాయి



ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయి ఆవరణలో ఉన్న భారీ డస్ట్‌బిన్‌లు

విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధుల ధ్వజం

- సర్పంచ్‌లకు ఎక్కడా ప్రాధాన్యత లేదంటూ ఆగ్రహం
- గరంగరంగా నాగులుప్పలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



విద్యుత్ శాఖపై సమీక్షిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ప్రతి మండల సమావేశంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పదేపదే కోరుతున్నప్పటికీ విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు పాత తీగలు, స్తంభాలను సరిచేయకుండా ప్రతిపాదనలు పంపామని సమాధానం చెప్పడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒమ్మెవరం సర్పంచ్ బాలకోటి మాట్లాడుతూ ఉప్పుగుండూరు నుంచి ఒమ్మెవరం గ్రామం వరకు విద్యుత్ లైన్ వేయడానికి ఎస్టిమేషన్ వేయాలన్నారు. మద్దిరాలపాడు గ్రామంలో తీగలు తెగిపడి ప్రమాదభరితంగా ఉన్నాయని సర్పంచ్ స్వర్ణ అనురాధ ప్రశ్నించారు. ఈ సమస్యలపై వివరణ ఇచ్చిన విద్యుత్‌శాఖ ఏఈ.. తదుపరి సమావేశం నాటికి ఈ సమస్యలన్నీ లేకుండా చూసుకుంటామని తెలిపారు. ఉప్పుగుండూరు గ్రామంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఈవో రవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బయట తిరగకుండా అందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏపీవో రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు గోకులం షెడ్లు, రైతువారీ కుంటలు మంజూరయ్యాయన్నారు. అలాగే ఉపాధి కూలీలకు రూ.60 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలన్నారు. జెడ్పీటీసీ యాదాల రత్నభారతి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా అందరం గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో మహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



చీమకుర్తిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు: కేరళ రాష్ట్రంలోని వాయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు అపార నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. అక్కడి బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఆదివారం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కేరళలో జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా భావించి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం.. ఈ ఘటనపై తాత్సారం చేయడంతో దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తిలో...

చీమకుర్తి: వాయనాడ్ వరద బాధితులకు చీమకుర్తిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు పాల్గొన్నారు.

పొలాల్లో గుర్తుతెలియని వాహనం



రోడ్డు పక్కన పడి ఉన్న బైక్

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివారులోని ఒక ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న కుంటలో గత రెండు రోజుల నుంచి మోటారు బైక్ ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హీరో కంపెనీకి చెందిన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో ఎవరిదనేది తెలియడం లేదు. చోరీ చేసి తీసుకొచ్చి అక్కడ ఉంచారా? లేక ప్రమాదం ఏమైనా జరిగిందా అనే విషయం పోలీస్ విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు



అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న అర్చకుడు



లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు



సామూహిక కుంకుమ పూజలో మహిళలు

ఒంగోలు మెట్రో: ఆషాడ మాసం అమావాస్య ఆదివారం పుష్యమి నక్షత్రం రవి పుష్య యోగ సందర్భంగా నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటాపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీ రావుపేటలో శ్రీ కనకదుర్గమ్మకు, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారికి, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి, కేశవస్వామిపేటలోని లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంట బుర్రబావి దగ్గర మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు, చెన్నకేశవస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర రాజలక్ష్మి అమ్మవారికి, సమతానగర్ కాలువ దగ్గర వెలసి ఉన్న కనకదుర్గ అమ్మవారికి, కమ్మపాలెంలోని కాళికా అమ్మవారికి, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానంలో, పెళ్లూరు జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర బాలాత్రిపురసుందరీదేవి కళారానికి, మంగమూరు రోడ్డులోని శివప్రసాద్‌కాలనీలో పోలేరమ్మకు, నీలంపాలెంలోని అంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాగర్పమ్మ, గద్దలగుంటలోని మహాలక్ష్మి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు మిలటరీకాలనీ యానాది సంఘంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక డైమండ్ పాయింట్ వద్ద వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రసాద్, రీజినల్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జోనల్ చైర్మన్ రామకృష్ణ పాల్గొని స్నేహితుల దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు ధరించి తమ మధ్య నెలకొన్న స్నేహబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంధి పార్థసారథి, కోశాధికారి లక్ష్మణస్వామి, క్లబ్ పూర్వ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్దన్, తాత అశోక్, క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో...

ఒంగోలు సెంట్రల్: స్నేహితుల దినోత్సవాన్ని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు నివాసం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. తీగల సత్యవతి, ధనిశెట్టి పావనిలు విజయరావుకు పుష్పగుచ్ఛం అందించి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.